

19 వ వసంతంలోకి ...

సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

బుధవారం,4 ఫిబ్రవరి 2026

8 పేజీలు


## సాగునీటి పంపిణీలో

# ఇబ్బందులు లేకుండా చూడాలి







**- జల వనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి**

**- సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యేల ఆదేశం**

**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం ఇరిగేషన్ శాఖ పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇరిగేషన్, డ్రైన్స్ అధికారులు సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 31వ తేదీన జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో జిల్లాలో రబి కి సంబంధించి సాగునీటి సరఫరాపై నియోజకవర్గాల వారీగా సమస్యల పరిష్కారంపై సాగు నీటి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రబి పంటకు సాగునీరు సరఫరాకు అమలు చేస్తున్న ప్రణాళికను తెలియజేయవలసిందిగా ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు జిల్లాలో ఆయకట్టు వివరాలు, వంతులు వారీగా సాగునీటి సరఫరా,నీటి లభ్యత, కాలువల మూసివేత అనంతరం చేపట్టే పనులపై శాసనసభ్యులు సమక్షంలో వివరించారు. రైతుల వద్ద నుండి వాటర్ టాక్స్ కట్టించడానికి నీటి సంఘం సభ్యులు అవగాహన కల్పించాలని, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని,పక్కాప్రణాళికతో సాగునీటివిడుదల చేపట్టాలన్నారు. ఓఅండ్ఎంలో కవర్ కానీ పనులకు ప్రతిపాదన తయారుచేసి సమర్పించాలన్నారు. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతికాలువ

- తరువాయి 2లో..

## పంచాయతీల పన్నులు వసూళ్ళలో నిర్లక్ష్యం

# వహిస్తే చర్యలు

**- ఎంపిడిఓలపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆగ్రహం**



**ఏలూరు,ఫిబ్రవరి,3** :గ్రామ పంచాయతీలలో పన్నుల వసూళ్లు లక్ష్యాలను సాధించిన అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లాకలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు.స్థానిక కలెక్టరేట్ నుండి పిఎంఅజయ్, యూనిఫైడ్ ఫామిలీసర్వే, పన్నులు వసూళ్లు, ఉపాధిహామీ, పీ4,కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్స్, వాట్సాప్ గవర్నెన్స్, అంగన్వాడీలలో టాయిలెట్లు, త్రాగునీరు సరఫరా,పారిశుద్ధ్యం,స్వమిత్వా,తదితర కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఆస్థి, నీటి పన్నుల వసూళ్లు కేవలం 18 శాతం మాత్రమే ఉండడంతో ఎంపిడిఓ లపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కార్యదర్సులవారీగా పన్నుల వసూళ్ల లక్ష్యాలపై నివేదిక సమర్పించాలని డిపిఓని కలెక్టర్ ఆదేశించారు. రానున్న వారం రోజులలో పన్నుల వసూళ్ళలో ప్రగతి లేకపోతే తక్కువ శాతం వసూలు చేసినఅధికారులు, సిబ్బందిపై చర్యలు

- తరువాయి 2లో..

## పొగాకుపై 18 శాతం ఎక్సైజ్ డ్యూటీ

# రద్దు చేసిన కేంద్రం

**- ధన్యవాదాలు తెలిపిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**ఏలూరు/ఢిల్లీ,మేజర్‌న్యూస్ :** బ్రాండ్ లేని ,రిటైల్ ప్యాకింగ్‌లేని తయారీ చేయని పొగాకు పై ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చే విధంగా విధించిన 18శాతం ఎక్సైజ్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈమేరకు కేంద్ర ఆర్థిక శాఖ ఆదివారమే గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. 2025 డిసెంబర్ నాటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ఎంపీ పుట్టామహేష్‌కుమార్ మంగళ వారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తన విజ్ఞప్తులను,రాష్ట్ర ప్రజా ప్రతినిధుల,రైతుల విజ్ఞప్తులను మన్నించి పొగాకుపై సుంకాన్ని తొలగించి నందుకు ప్రధానికి, కేంద్ర మంత్రులకు,ప్రభుత్వానికి ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

**- రైతుల పోరాటం,ఎంపీ మద్దతు -** పొగాకు రైతులు, రైతు సంఘాల నేతలు జనవరి మొదటి వారంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఏలూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సుంకాల పెంపు ప్రభావంతో పొగాకు

- తరువాయి 2లో..

## వెదురు అక్రమరవాణాకు అడ్డా - రుద్రంకోట ఫారెస్ట్ గుట్ట !

**- రిజర్వ్ అటవీ ప్రాంతంలో వెదురు చెట్ల నరికివేత**





**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :** వెదురు చెట్లు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నందిస్తాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చెట్ల పెంపకం పై ప్రత్యేక చర్యలు తీసుకొని చెట్ల పెంపకం,పరిరక్షణకు నిధులు మంజూరు చేస్తున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో వెదురు చెట్ల పై స్మగ్లర్ల గొడ్డలి వేటు పడుతుండటంతో చెట్లు క్రమంగా కనుమరుగు అవుతున్నాయి. అడవిని కాపాడాల్సిన కొందరు అధికారులే స్మగ్లర్లతో చేతులు కలిపి తమ ఇష్టానుసారంగా అక్రమ వెదురు రవాణాకు పూనుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ గుట్టలో పచ్చి వెదురు చెట్లు నరికి అడవిలోనే వాటిని ఆరబెట్టి అక్రమరవాణాకు రోజుల సమయంతో కూడుకున్న స్మగ్లింగ్.

- తరువాయి 2లో..

## జంతు కళేబరాల కొవ్వు నుండి నూనెలు తయారి

**- ముఠా గుట్టు రట్టు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు**







**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జంతు కళేబరాల నుండి వచ్చే కొవ్వు నుండి నూనెలు తయారు చేస్తున్న ముఠా గుట్టును విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మంగళవారం రట్టుచేశారు,ఆదివారపు పేట,తంగెళ్ల మూడి -2 ప్రాంతాల్లో నూనె తీస్తున్న ఇంటిని సోదా చేసి 15 లీటర్ల 30 టిన్నులు సీజ్ చేశారు ప్రస్తుతం వన్ టౌన్ ప్రాంతంలో కూడా తనిఖీలు కొనసాగుతు న్నాయి. ఈ దాడిలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐలు ప్రసాద్ కుమార్,గంగ భవాని,ఎస్ఐ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ నూనెను పలు ప్రాంతల్లో విక్రయిస్తునట్టు అందిన సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిసింది.

# బాల్యవివాహాల నిరోధానికి విస్తృత అవగాహన సదస్సులు





**– జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో బాల్య వివాహాలు నివారించడానికి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ చెప్పారు. బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ వారి సమన్వయంతో క్రాఫ్ (చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్) వారు రూపొందించిన బాల్య వివాహ విముక్తి రథాన్ని జేసీ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా ఆరోగ్య దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేసి జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ విముక్తి రథం జిల్లాలోని అన్ని మండలాలలో ప్రజలకు బాల్యవివాహానికి వ్యతిరేకంగా ప్రచారం కల్పించడంలో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ప్రజలు గుర్తిస్తే 1098,112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన వారి పేరు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. క్రాఫ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ బి ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ బాల్య వివాహ విముక్తి రథం ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల్లో రోజుకి ఒక మండలం చొప్పున ప్రచారం నిర్వహిస్తుంది అని అన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకి వ్యతిరేకంగా జేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి శారద, నోడల్ ఆఫీసర్ తులసి,జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్ సూర్యచక్రవేణి, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్టర్ సిహెచ్ నిర్మల, డిసిపియు సిబ్బంది జాహ్నవి, రాజేష్, మాధవి, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్లు వినోద్,విద్యా శాఖ అధికారులు సొంగా నాగేశ్వరరావు, జిసిడిఓ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెదురు అక్రమరవాణాకు అడ్డా - రుద్రంకోట ఫారెస్ట్ గుట్ట !

**మొదటిపేజి తరువాయి**

అక్రమ వెదురు రవాణాకు రోజుల సమయంపడుతున్నప్పటికీ సంబంధిత అటవీ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారా. లేదా కాసులకు కక్కుర్తి పడి ఏపుగా పెరిగిన వెదురును అమ్మేస్తున్నారా అన్నది ఫారెస్ట్ ఉన్నత అధికారుల విచారణలో వెల్లడయ్యే అవకాశం ఉంది. వివరాలు ఇలాఉన్నాయి.కుక్కునూరు ఫారెస్ట్ రేంజ్ లోని వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట బీట్ పరిధిలో గల లచ్చిగూడెం రిజర్వ్ ఫారెస్ట్‌లో వెదురు చెట్లు అపారంగా ఉన్నాయి. సుమారు 100 ఎకరాల పైబడి రిజర్వ్ ఫారెస్ట్ గుట్టల్లో వెదురు విస్తారంగా లభిస్తుంది.ఒక్కో వెదురు చెట్టును 6 అడుగుల వరకు నరికి ఎడ్ల బండ్లు,ట్రాక్టర్ల సహాయంతో తరలించుకు పోతున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి.రుద్రంకోట బీట్ లోని ఎత్తైనా గుట్ట మొత్తం పరిశీలించగా ఎక్కడ చూసినా వెదురు చెట్లు గొడ్డల్లతో నరికిన ఆనవాళ్లు దర్శన మిస్తున్నాయి. కత్తిరించిన వెదురును ఏజెన్సీలో వెదురు కంకెలు అని పలుకుతారు. ప్రస్తుతం వీటికి మంచి డిమాండ్ ఉండటంతో స్మగ్లర్ల పంట విరాజిల్లుతోంది. మండలంలో మిర్చిపంట సాగవుతోంది.పంట రక్షణలో భాగంగా కంచెకు వెదురు కంకెలు అవసరమవుతుండటంతో వెదురు చెట్లు గొడ్డల్లతో నరికి తరలించుకు పోతున్నారు. కంచే చేను మేస్తున్న చందంగా ట్రక్కు నిండా వెదురు కంకెలు తరలిస్తే ఒక్కో ట్రక్కుకు గాను 2 వేల రూపాయలను సంబంధిత బీట్ అధికారులకు స్మగ్లర్లు ముట్ట చేస్తున్నరానేది బహిరంగ రహస్యం.ఈ అంశం మండలంలో చర్చ నియాంశంగా మారింది.

లచ్చి గూడెం ఫారెస్ట్ మొత్తంలో కొంత మేర పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉందని అధికారులు గుర్తించారు.ముంపు రాక ముందే రిజర్వ్ ఫారెస్ట్ గుట్టలో ఉన్న లక్షలాది రూపాయలు విలువ చేసే వెదురును నరికి తరలించుకు పోతున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెదురు నరికివేత నిరోధించి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. ఈ విషయం పై కుక్కునూరు ఫారెస్ట్ రేంజ్ అధికారిని కె.కృష్ణకుమారిని వివరణ కోరగా ఈ విషయం పై విస్తృతంగా తనిఖీలు చేపట్టి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

# సింథసిస్ ట్రస్ట్ 5వ వార్షిక వేడుక



నర్సాపురం,మేజర్ న్యూస్ : సింథసిస్, వై యన్ కాలేజీ,టేలర్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు సంస్థ, 5వ వార్షిక వేడుకలు పట్టణంలోని కోవెల గుడి వద్ద ఎర్రమిల్లి హౌస్‌లోని సింథసిస్ కార్యాలయంలో జరిగినవి. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో గడిచిన 5 సంవత్సరాలలో సింథసిస్ సుమారు 20 లక్షల రూపాయలు వైయన్‌కాలేజీ,టేలర్ హైస్కూల్ కు విద్యా సామాగ్రి రూపంలోనూ,పేద విద్యార్థులకు చదువులకు వివిధ సెమినార్లు కు సమకూర్చినట్టు ట్రస్ట్ సెక్రటరీ రంగినీడి సుబ్బారావు నివేదకలో తెలియ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులకు స్థానిక సాఫ్ట్ లైన్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, టేలర్ స్కూల్ నందు బాలికలకు వాష్ రూమ్, దూర ప్రాంతాల్లో నుండి స్కూళ్లు వస్తున్న బాలికలకు సైకిల్ పంపిణీ, కాలేజీ విద్యార్థులు మరింత ఉన్నత ప్రమాణాలతో సాంకేతిక రీసెర్చ్ డెవలప్మెంట్ కెరియర్ కు సంబంధించిన విషయలపై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎర్రమిల్లి శివాజీ, వైస్ ఛైర్మన్ ఎర్రమిల్లి కృష్ణ ప్రసాద్, చినమిల్లి సత్యనారాయణ,అందే సతీష్ ,పోతుల జగన్, క్యాపిటల్ రాజు సుధీర్ మోహన్,రామ్మోహన్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రజలు పర్యవేక్షించాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్;** రోడ్లు, డ్రైన్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ఆయా గ్రామాల ప్రజలు పర్యవేక్షించాలని, న్యాయమైన అభివృద్ధి పనులు జరిగేందుకు సహకరించాలని ప్రభుత్వ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. పెదతాడేపల్లి గ్రామం నుంచి రామన్నగూడెం, జగ్గన్నపేట, వెంకట రామన్న గూడెం వరకు అదనపు ప్రణాళిక నిధులు మూడు కోట్ల 50 లక్షలతో చేపట్టిన ఈ సిమెంటు రోడ్డు, తారు రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాలను పట్టణానికి అనుసంధానిస్తూ నిర్మించే ఈ రోడ్లు అభివృద్ధికి బాటలు పరుస్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనేక అవస్థలు పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్లు, డ్రైన్లు నిర్మించి పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడపా ప్రసాదు, పుల్లా బాబీ, పరిమి సురేష్, ఎంపీటీసీ గోవిందు, బండి బుజ్జిబాబు, పరిమి సూర్య నారాయణ, పాలూరి వెంకటేశ్వరరావు, రామ లక్ష్మణ్, మద్దిపాటి ధర్మేంద్ర, మద్దిపర్తి రవితేజ, ఉడతా బాలాజీ, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగునీటి పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**మొదటిపేజి తరువాయి**

మురుగుకాలువలను తలపిస్తున్నా యని, దుర్భరమైన పరిస్థితులలో రైతులు సాగు చేస్తున్న అన్నారు. మురుగునీరు కాలువలనులోకి వెళ్లకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడు తూ కాలువలు, డ్రైన్స్ సంబంధించి చేపట్టవలసిన పనులకు ఫిబ్రవరి నెలాఖరు నాటికి టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి, పాలు కట్టేసే నాటికి చేయవలసిన పనులకు సిద్ధంగా ఉండాలన్నారు. తణుకు శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రబీ పంటకు ఎటువంటి సాగునీటి సమస్యలేకుండాఅధికారులు సమయముతో పనిచేయాలన్నారు. ఇరిగేషన్, డ్రైన్స్ ఇంజనీరింగ్ అధికారులు గతంలో చేపట్టిన పనులు,వివిధ పనులకు ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనలు అంచనా వ్యయం, తదితర సమాచారాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకునే విధంగా ఉండాలన్నారు. ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో రబీ సాగు ఆయకట్టు విస్తీర్ణం, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు, రబీ పంటకు సాగునీరు లభ్యత, తదితర వివరాల గణాంకాలు కావాలని కోరగా సంబంధిత ఎస్ ఇ సమావేశంలో లేకపోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సాగునీటి సంఘాల అధ్యక్షులు మురళి కృష్ణంరాజు,ఇరిగేషన్ ఈఈ యు.సురేష్, డ్రైన్స్ ఈఈ సత్యనారాయణ, ఇరిగేషన్, డ్రైన్స్ ఇంజనీరింగ్ అధికారులు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ,డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, నీటి సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**మొదటిపేజి తరువాయి**

తీసుకుంటానన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్,డ్వామా, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల ద్వారా చేపట్టే వివిధ నిర్మాణ పనులను ఫిబ్రవరి నెలాఖరు లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన కింద చేపట్టిన రోడ్లు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాల పనులను నిర్దేశించినసమయంలోగా పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తిచేసిన వెంటనే బిల్లులను ఆన్లైన్‌లో సమర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీరు, టాయిలెట్లు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిదినాల కల్పన నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పైప్రజలకు విస్తృతమైన అవగాహన కలిగించి మన మిత్ర'యాప్‌ను ప్రజలు డౌన్లోడ్ చేసుకుని వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో నిర్దేశించిన మేర అక్షరాస్యత సాధించాలన్నారు. పీ4కార్యక్రమంలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసం ధానం చేయాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి,పంచాయత్ రాజ్,ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు జెడ్.రమేష్,త్రినాధ్ బాబు, డ్వామా పీడీ సుబ్బారావు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## పొగాకుపై 18 శాతం ఎక్సైజ్ డ్యూటీ రద్దు చేసిన కేంద్రం

**మొదటిపేజి తరువాయి**

వేలం జరిగే ఫిబ్రవరి–మార్చిలో కొనుగోలుదారులు ఆసక్తి చూపకపోతే ధరలు పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆ సందర్భంగా ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రధానికి కేంద్ర మంత్రులకు లేఖలు రాయటంతోపాటు, ఢిల్లీలో కేంద్ర మంత్రులను స్వయంగా కలిసి సమస్యను వివరించారు. ఎంపీ సూచన మేరకు ఏపీకి చెందిన రైతులు కూడా కొద్ది రోజుల క్రితం కేంద్ర ఆర్థిక మంత్రిని, ఎంపీలను కలిసి స్వయంగా విజ్ఞప్తి చేశారు. పొగాకుపై, పొగాకు ఉత్పత్తులపై అదనంగా విధించిన జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీని తగ్గించాలని ప్రధాన మంత్రికి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి, వాణిజ్య శాఖ మంత్రికి, ఇటీవల తాను లేఖ రాసిన విషయాన్ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విడుదల చేసిన ప్రకటనలో గుర్తు చేశారు.

– పొగాకు రైతుల హర్షం –

పన్ను పెంపుతో రైతులకు జరిగే నష్టాన్ని ప్రధాని దృష్టికి, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకు వెళ్ళి ఆ ప్రతిపాదనను ఉపసంహరించు కొనేలా కృషి చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా, ఇతర పార్లమెంట్ సభ్యులు,పొగాకు బోర్డు చైర్మన్ కు,రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి పొగాకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# 9న అభయాంజనేయ స్వామి వారి నవమ వార్షికోత్సవం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** స్థానిక 4వ వార్డు ఇందిరానగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి నవమ తొమ్మిదవ వార్షికోత్సవం ఈ నెల 9వ తేదీ సోమవారం జరగనుందని ఆలయ నిర్మాణకర్త వలవల తాతాజీ,మేరీ సుశీల దంపతులు తో కూడిన ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం స్వామి సన్నిధిలో వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. సోమవారం పూజా కార్యక్రమాలు తాతాజీ,మేరీ సుశీల దంపతులచే కురెళ్ళ రాంబాబు శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయి. హనుమద్ వైభవం పై ఆధ్యాత్మిక ప్రవచనం కెఎల్ఎన్ ధన కుమార్ అందజేస్తారని తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక సాయిస్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్,డాక్టర్ వేణు సూపర్ స్పెషాలిటీ, గౌతమి నేత్రాలయ,రాజమండ్రి శ్రీరమా డెంటల్ వైద్యశాల,రాజమండ్రి వారిచే ఆయా విభాగాల్లో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

నేత్ర వైద్య శిబిరంలో ఎంపిక చేయబడిన నిరుపేదలకు సుశీల హాస్పిటల్ అధినేత డాక్టర్ కాకర్ల రామచంద్ర బాబు కళ్ళజోళ్లను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అచ్యుత్ శ్రీనివాస రావు,బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పి.వి.రామలక్ష్మి,తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నవరసపురం - వైవి లంక రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం




**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్:** నవరసపురం– ఏనుగువానిలంక ఆర్ అండ్ బి రోడ్డు పునర్నిర్మాణం పనులను వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు రోడ్డుపై నిరసన తెలిపి నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు పనుల ప్రారంభించి మధ్యలోనే ఆపేశారని అన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు స్థానిక ప్రజలు ఎన్నిసార్లు ఆందోళనలు చేసిన ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూడా నిరసన తెలుపారని గుర్తు చేశారు. అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడిచిన ఈ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదని అన్నారు.నరసాపురం,యలమంచిలి మండలాలను కలిపే ప్రధాన రహదారి నిర్మాణం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. ప్రభుత్వ అధికారులు రోడ్డు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు,పొగాకు నారాయణరావు, కోడి లక్ష్మణరావు, నోముల కొండ, మామిడి తవిటి నాయుడు, జి. వెంకటరమణ (రాజు)తదితరులు పాల్గొన్నారు.

# 30 రాష్ట్రాల్లో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు

**– ఎంపీ పుట్టా మహేష్ కు కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ సమాధానం**



**ఏలూరు/ఢిల్లీ,మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా మొత్తం 30 రాష్ట్రాలు ,కేంద్రపాలిత ప్రాంతాల్లో ఫోరెన్సిక్సైన్స్ లేబరెటరీలు ఉన్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం లోక్ సభలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న ఎఫ్ఎస్ఎల్ లలో డీఎన్ఏ విశ్లేషణ , సైబర్ ఫోరెన్సిక్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి నిర్భయ నిధుల పథకం కింద 244.89 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఢిల్లీ, చండీగఢ్, కోల్ కతా,అస్సాం, భోపాల్,పూణేలలో ఉన్న ఆరు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీల్లో సౌకర్యాల కోసం మహిళా భద్రత పథకం కింద 126.84 కోట్ల నిధులు కేటాయించగా, వీటిలో ఇప్పటివరకు 22.51 కోట్లు వినియోగించబడ్డాయని మంత్రి తెలిపారు. సైబర్ ఫోరెన్సిక్ రంగంలో శిక్షణ కార్యక్రమాలు కోసం నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం గత ఐదు సంవత్సరాలలో 66 శిక్షణా కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు.

# సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం



**ఉండి, మేజర్ న్యూస్:** ఉండి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉండి మండల వ్యాప్తంగా సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ఉండి రైతు సేవా కేంద్రం వద్ద సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీఏ ప్రతాప్ జీవన్ మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాసు సారథ్యంలో రైతులందరికీ బ్రోమడియోలోన్, నూకలు ,నూనె కలిపి మిక్స్ చేసిన ఎలుకల నివారణ ఎరమందును పొట్లాలు కట్టి రైతులకు పంపిణీ చేయడం జరిగినది. ఏడిఏ ప్రతాప్ జీవన్ మాట్లాడుతూ ఎలుకల యొక్క ఉధృతిని బట్టి ఎకరానికి 10 ప్యాకెట్లు వరకు తెరిచి ఉన్న ఎలుకల కన్నాల వద్ద ఎర పొట్లాలను ఉంచాలని,ఈ ఎలుకల నివారణ కార్యక్రమం రైతులందరూ సామూహికంగా చేపట్టి నట్లయితే సమర్థవంతంగా ఎలుకలను నివారించవచ్చని తెలిపారు.

ఉండి మండలంలో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద కూడా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పరంజ్యోతి,విఏఏలు లావణ్య, చంద్రబాబు రైతులు ఇల్లాపు వెంకట అప్పాజీ, పోలుబోతు రాము,పి. సింహాచలం, ప్రత్తివాడ శ్రీను తదితర రైతులు పాల్గొన్నారు.

# ఈ -పంట నందు వివరాలు నమోదు చేసుకోవాలి



**జంగారెడ్డిగూడెం, మేజర్‌న్యూస్:** ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను ఈ -పంట నందు నమోదు చేసుకోవాలని,ప్రతి రైతు విశిష్ట సంఖ్య రైతు సేవ కేంద్రం ద్వారా వివరాలు తెలియపరచాలని ఎడిఎ జీ.బుచ్చిబాబు అన్నారు. మండలంలోని వేగవరం,లక్కవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సబ్సిడీ పథకాలు వీటికి వర్తిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతాంగం పొలం నుండి మట్టి నమూనాల సేకరణ మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్,రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు స్థానిక చైతన్య కళాశాల వెనుక రైల్వే ట్రాక్ పై మంగళవారం మృతి చెందాడు.

మృతుడు 25 నుండి 30 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని,బ్లూ షర్ట్ సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని,ఎత్తు అయిదు అడుగులు ఉంటాడని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే హెచ్‌సి శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు.అతని పొట్టపై పచ్చబొట్టు ఉందని తెలిపారు.

# విద్యావేత్త సర్వి చెట్టికి నివాళులు



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** విద్యావేత్త పద్మశ్రీ అద్దేపల్లి సర్విచెట్టి 34 వ వర్ధంతి సందర్భంగా బీజీబీఎస్ మహిళా కళాశాల ఆవరణలో సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ డాక్టర్ నూలి శ్రీనివాస్ చెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఘనంగా అర్పించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థుల కోసం పట్టణంలో అనేక విద్యాసంస్థలు నెలకొల్పి వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు కృషి చేశారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ నూలి శ్రీనివాస్ అన్నారు. అప్పట్లో పేదలు, మహిళలు చదువుకునేందుకు అవకాశం లేకపోతే సర్విశెట్టి దాతల ద్వారా ఆస్తులను సేకరించి విద్యాలయాలు నెలకొల్పారని అన్నారు.ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన బాటలో నడవాలని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరజ,కారుమూరి సూర్యనారాయణ , స్టాఫ్,స్టూడెంట్స్ పాల్గొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

# ఆక్వా ఫీడ్ ధరలు పెంపు దారుణం

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శ**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఆక్వా ఫీడ్ ధరలు పెంపు దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం స్థానిక అన్నే భవనంలో ఆక్వా ఫీడ్ ధరలు పెంపు పై ఆయన మాట్లాడారు. ఫీడ్ తయారీ కంపెనీలు సిండికేట్ గా మారి ఏకపక్షంగా ఫీడ్ ధరలు పెంచడం తగదన్నారు.టన్ను ఫీడ్ కు రూ.4వేలు పెంచడం వలన ఉత్పత్తి ఖర్చులు పెరిగి ఆక్వా రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆక్వా రైతులు తీవ్ర కష్టాల్లో, నష్టాల్లో ఉన్నారని చెప్పారు. సోయాబీన్ వంటి రా మెటీరియల్ ధరలు బాగా తగ్గినప్పుడు ఫీడ్ ధరలు తగ్గించలేదని, రైతులు 20 రూపాయలు తగ్గించమని కోరితే రూ.3.12 తగ్గించినట్లు ఎమ్మార్పీలో మతలపు చేసి పాత ధరలకే ఫీడ్ అమ్మారని గుర్తు చేశారు. ఇప్పుడు రామెటీరియల్ ధరపెరిగిందని ధరలు పెంచుతున్నట్లుగా కంపెనీ చెప్పడం అన్యాయమ న్నారు. ప్రభుత్వంతో చర్చించకుండా కంపెనీలో సిండికేట్ గా మారి ఏకపక్షంగా ధరలు పెంచి రైతులపై భారం వేయడం వలన రైతుల ఇబ్బందులు పడుతారని, ప్రభుత్వం జోక్యంచేసుకొని కంపెనీలను నియంత్రించి ఆక్వా ఫీడ్ ధరలు పెంచకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులు ప్రయోజకులు కావాలంటే తొలిమెట్టు 10 పాస్ కావాలి





**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**ఆకివీడు,మేజర్‌న్యూస్ :** ఆకివీడు మండలం పెదకాపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి  ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల హాజరను, ప్రతిరోజు నిర్వహిస్తున్న మాక్ టెస్ట్‌ల మార్కులను పరిశీలించి ప్రతివిద్యార్థిని వారివివరాలను అడిగి తెలుసుకు న్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాల హాజరై హోటల్ నేర్చుకోవాలని తెలిపారు

.ముఖ్యంగా 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే సబ్జెక్టులు చాలా ముఖ్యమైనవని, గ్రూప్ 1,గ్రూప్ 2,యుపిఎస్సి, ఐఏఎస్ తదితర పరీక్షలు అన్నింటికీ ఆ సబ్జెక్టులే పునాది అన్నారు.మీరు పాఠశాలకు వచ్చిబాగా చదువుకుంటే మంచి ప్రయోజకులు అవుతారని, జీవితంలో స్థిరపడి తద్వారాతల్లిదండ్రులను చూసుకోగలుగు తారన్నారు.  పదవ తరగతి ఉత్తీర్ణత తరువాత ఐటిఐ, పాలిటెక్నిక్,నర్సింగ్ తదితర కోర్సులు చదివితే కోర్సు పూర్తి అయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని సూచించారు. ప్రతి విద్యార్థి పాఠశాల నందు ఉన్న లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంలో విద్యార్థులచే బాగాచదువుతామని, తల్లిదండ్రులను చూసుకుం టామని ప్రతిజ్ఞ చేయించి, వారి దగ్గర నుండి ప్రమాణం తీసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని స్పోర్ట్స్ ఎక్విప్మెంట్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ప్రయోగశాల,మియా వాకి ఫారెస్ట్, బాస్కెట్ బాల్‌కోర్టు,షటిల్‌కోర్టు పరిశీలించి ప్రధానోపాధ్యాయుల కు పలుసూచనలు చేశారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ చేస్తున్న ప్రాసెస్‌ను అడిగి తెలుసుకున్నారు.  తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి అందించేలా ప్రజలలో అవగాహన కల్పించాలని గ్రామ సర్పంచ్, ఎంపీపీ లకు సూచించారు.

వాటర్ టాక్స్ కలెక్షన్ ను స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డీఈవో ఇ.నారాయణ,స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు అధికారి వై.దోసి రెడ్డి,ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బేబీ స్నేతు,ఎంపీపీ కటారి జయలక్ష్మి, ఎంఈఓ రవీంద్రనాథ్,పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఏఎల్‌వి సత్యనారాయణ,తహసిల్దార్ ఫరూక్ఇన్చార్జి ఎంపీడీవో బిఈ మార్కండేశ్వరరావు, పంచాయతీ సెక్రెటరీ వెంకన్న, వీఆర్వో సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ఆరాచక పాలనలో భయాందోళనకు గురౌతున్న ప్రజలు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** డైవర్షన్ రాజకీయాల్లో బాగంగా చంద్రబాబు చేస్తున్న ఆరాచక పాలనలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు పై కార్యకర్తలపై జరుగుతున్న దాడులు చూస్తుంటే ప్రజలు భయ భ్రాంతులు గురవుతున్నారని రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెసు పార్టీ బిసి విభాగం సంయుక్త కార్యదర్శి మామిడి శెట్టి చిట్టిబాబుఅన్నారు,తిరుమల వెంకన్న లడ్డూ విషయంలో  సి.బి.ఐ సిట్ విచారణలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని రిపోర్ట్ రావడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వం పై వ్యతిరేకత మరింతగా పెరగడంతో మాజీ మంత్రి అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల పై తెలుగు దేశం గుండాలు ఇంటిపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేయడం హేయమైన చర్య.

ఈ సంఘటనలు జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ తిరిగి అంబటి రాంబాబుపై ఎదురు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం..అలాగే జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబు ఇల్లు ధ్వంసం చేసిన  ఘటన చూస్తుంటే ప్రజల్లో కూటమి ప్రభుత్వాన్ని అసహించుకుంటున్నారని  చిట్టిబాబు  ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లా అభివృద్ధి - నిర్మాణంలో సమన్వయంతో పని చేయాలి




**– అధికారులు మంచి ఫలితాలు సాధించాలి : జడ్‌పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఉభయ జిల్లాలో అభివృద్ధిలో  కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించి,ఆదర్శ జిల్లా పరిషత్తుగా తీర్చిదిద్ద వలసిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ  అన్నారు.మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఛాంబర్లో జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. జిల్లా పరిషత్తు సిఇవో, ఉభయ జిల్లాల అధికారులు, జిల్లా పరిషత్తు సభ్యులతో కలసి 1,2,4,7 వ స్థాయి సంఘ సమావేశాలలో శాఖలు వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. 3వ స్థాయి సంఘ సమావేశం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ,జడ్పీటీసీ సభ్యులు పోసిన శ్రీలేఖ, 5వ స్థాయి సంఘం చైర్మన్ అండ్ జడ్పీటీసీ సభ్యులు మొడియం రామతులసి,6వ స్థాయి సంఘం చైర్మన్ అండ్ జడ్పీటీసీ సభ్యులు పెనుమాల విజయబాబు ఈ మూడు స్థాయి సంఘంములు జిల్లా జెడ్పీ సిఈవో ఛాంబర్లో  ఆయా అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత  ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంతో అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా ముందుకు పరుగులు పెడుతుందని అన్నారు.జిల్లాలో త్రాగునీరు, సాగునీరుకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు.

మార్చి, ఏప్రిల్ మాసంలో గోదావరిలో నీటిమట్టం తగ్గుతుందని, ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఇప్పటి నుండే మొదలు పెట్టాలని నీటిపారుదలశాఖ అధికారులకుఆదేశించామని తెలిపారు.పరీక్షా సమయంలో విద్యార్థులు చెయ్యి ఎత్తిన చోట బస్సులు ఆపు చెయ్యాలని, ఒక్క నిమిషం లేటుఅయినా పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదు కనుక ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సచివాలయ ఉద్యోగులు పనితీరు మరింత మెరుగు పరచుకుని, సమయపాలన పాటించి ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.జిల్లా పరిషత్తు సమావేశాలకు ముఖ్యంగా ఆయా జిల్లాల నుండి అధికారులు హాజరు కాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ, హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సిఈవోను ఆదేశించామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు సిఇవో యం.శ్రీహరి,డిప్యూటీ సిఇవో కె.భీమేశ్వర్, ఉభయ జిల్లాల వివిధశాఖలు అధికారులు, పలువురు జెడ్పిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలు, పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయి

**– ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**



**చింతలపూడి,మేజర్ న్యూస్ :** ఏలూరు మేత్రాసన బిషప్ శ్రీ శ్రీ శ్రీ పొలిమేర జయరావు ఆశీస్సులతో  జరుగుచున్న, జనవరి 31, ఫిబ్రవరి 1,2 తేదీలలో చింతలపూడి మండలం అల్లిపల్లిలో జరుగుచున్న అల్లిపల్లి మరియ తల్లి ఉత్సవాలులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, సతీమణి విజయ సొంగాతో కలసి సోమవారం రాత్రి పాల్గొన్నారు.అల్లిపల్లి పుణ్యక్షేత్ర విశిష్టతను తెలియజేసేలా ప్రతియేటా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి అని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు,ఈ ఉత్సవాలలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు, ఆ తరువాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ , విచారణ గురువులైన ఫాదర్ మరియజోజి రాయ్, పలువురు గురువులతో కలసి శాసన సభ్యుల వారి దంపతులను ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్ర మంలో దివ్య పూజ బలి సమర్పించి ప్రజలందరికీ ఆశీస్సులు అందించిన ఏలూరు మేత్రాసన బిషప్ పొలిమేర జయరావు పలువురు గురువులు,ఈ కార్యక్రమంలో భక్తులు,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**– వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే అంజిబాబు సమీక్ష**



**భీమవరం,మేజర్ న్యూస్ :** ఈనెల 13వ తేదీ నుంచి 17వ వరకు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో శివరాత్రి ఉత్సవాలపై సమీక్షించారు. 5 రోజులపాటు పంచారామ క్షేత్రమైన  శ్రీసోమేశ్వర స్వామి ఆలయం, శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, శివుని దర్శనం ప్రతి భక్తునికి కలిగేలా చూడాలని, రథోత్సవంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. దూర ప్రాంతాల నుంచి ఎంతో మంది భక్తులు తరలివస్తారని,పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి,డీఎస్పీ రఘువీర్ విష్ణు,తహసీల్దార్ రావి రాంబాబు,ఆలయ ఈవోలు, చైర్మన్లు,పాలకవర్గ సభ్యులు,పోలీసు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 12న జరిగే సమ్మె జయప్రదం చేమాలి



**భీమడోలు ,మేజర్ న్యూస్ :** ఎన్.డి.ఎ. ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు కోరారు. ఈనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా జరుగనున్న కార్మిక, ఉద్యోగుల సమ్మె సన్నహక చర్యల్లో భాగంగా మండలంలో మంగళవారం పర్యటించిన లింగరాజు కార్మిక, ఉద్యోగుల సంఘాల నాయకులను, సభ్యులను కలిశారు.

ఇదే క్రమంలో పూళ్ళ, గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద జరుగుతున్న ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. సమ్మె గోడ పత్రికలను ఆవిష్కరించి,విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలు వల్ల నష్టపోతున్న సమ్మె హక్కు,జాతీయ ఆరోగ్య మిషన్ కు నిధుల కోత,ఉపాధి హామీ చట్టం రద్దు,విత్తనాల చట్టం,విద్యుత్ సవరణ చట్టం ఇతరాల వల్ల కలగనున్న ఇబ్బందుల గురించి వివరించారు. అనంతరం సిఐటియు మండల సమన్వయకర్త కె. వెంకటేశ్వరరావు పాల్గొని  ప్రసంగించారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు పద్మ,సలోమి, నాగజ్యోతి, ఉదయమణి పాల్గొన్నారు.

# అక్క,తమ్ముడుని దత్తత తీసుకున్న జోగులాంబ గద్వాల జిల్లా వాసులు



– జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమక్షంలో అప్పగింత

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న దత్తత కార్యక్రమాల్లో భాగంగా కారా నియమ నిబంధనల ప్రకారం బాపిరాజు,భవాని అను ఇద్దరు అక్క తమ్ముళ్లను తెలంగాణ రాష్ట్రం జోగులాంబగద్వాలజిల్లాకు చెందిన ముత్యాలు రాతాలు,హరిజనమ్మ దంపతులకు మంగళవారం జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి సమక్షంలో అప్పగించడం జరిగింది.ముత్యాలు రాతాలు ,హరిజనమ్మ దంపతులు పది నుంచి 12 సంవత్సరాలు వయసు కలిగిన పిల్లలను దత్తత తీసుకోవాలని 2023 సంవత్సరంలో కేరింగ్స్ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవడం జరిగింది,వారికి ఏలూరు జిల్లాలోని శిశుగృహకు లింకు అయి ఉన్న శ్రీ రవితేజ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ నందు సిడబ్ల్యూసి వారి ఆదేశాల ప్రకారం నివసిస్తున్న బాపిరాజు,భవాని అను ఇద్దరు అక్క తమ్ముళ్లను రిజర్వ్ చేసుకోవడం జరిగినది,దాని ప్రకారం ఏలూరు జిల్లా దత్తత అప్రూవల్ కమిటీ వారి ముందు హాజరై వారికి సంబంధించిన డాక్యుమెంట్స్ అన్నింటిని సమర్పించి ఫ్రీ అడాప్షన్ పోస్టర్ కేర్ కింద 60 రోజులపాటు వారి వద్ద ఉంచుకొని వారి సర్దుబాట్లు అక్కడి అలవాట్లకు అక్కడి కుటుంబనీకి పిల్లలు అలవాటుపడే విధంగా తయారవ్వటానికి స్థానిక కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నందు జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి సమక్షంలో ఈ అక్క తమ్ముళ్లను వారికి అప్పగించడం అయినది.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.శారద,జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్ సూర్యచక్రవేణి,శిశు గృహ మేనేజర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## 15 నుండి తాడువాయిలో మహాశివరాత్రి మహోత్సవాలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మండలంలోని ఈనెల 15వ తేదీ ఆదివారం నుండి 19వ తేదీ మంగళవారం వరకు ఐదు రోజులు మహాశివరాత్రి మహోత్సవములు ఘనంగా జరుగుతున్నాయి. దక్షిణ కాశీగా పేరుందిన 900 సంవత్సరాల చరిత్ర కలిగిన స్వయంభు శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి దివ్య కళ్యాణం మహోత్సవములకు దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పునూతల పుల్లారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. మొదటి రోజు ఆదివారం రుద్రాభిషేకంతో సహా వివిధ పూజా కార్యక్రమాలు రెండవ రోజు సోమవారం, సాయంత్రం శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవం (ఊరేగింపు), మూడవరోజు మంగళవారం శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం, నాలుగవ రోజు బుధవారం శ్రీ అపర్ణా సమేత స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం,5వ రోజు గురువారం రాత్రి శ్రీ స్వామివారికి అమ్మవారికి శ్రీ పుష్పయాగము (పవళింపు సేవ) పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ఐదు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆలయంలోని పూజా కార్యక్రమాలు ఏర్పాట్లు, సౌకర్యాలను పాపోలు వెంకట శ్రీనివాస్, కాసారపు వెంకటరమణ పర్యవేక్షిస్తున్నారు.తాడువాయి మహాశివరాత్రి మహోత్సవాలకు ఉభయగోదావరి జిల్లాల నుండి కాకుండా కృష్ణాజిల్లా,తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి, అశ్వరావుపేట తదితర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవడం జరుగుతోంది.

## హిందువుల మనోభావాలతో ఆడుకునే పార్టీలను భూస్థాపితం చేద్దాం

– ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** దేవదేవుడు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి కీర్తికి ప్రత్యేకతకు ప్రతీకా అయిన లడ్డు ప్రసాదాన్ని కల్తీ చేసి హిందువుల మనోభావాలతో ఆటలాడుతున్న పార్టీనీ భూస్థాపితం చేయాలని శాసనసభ్యులు చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని కల్తీ చేయడమే కాకుండా కోట్ల మంది హిందువుల మనోభావాలతో వైసిపి నాయకులు ఆటలాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి అని చూడకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న తీరును తాను ఖండిస్తున్నానని అన్నారు. కల్తీ లడ్డు విషయమై ప్రతి హిందువు సంఘటితం కావాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపులో భాగంగా కల్తీ లడ్డు విషయాన్ని తాము ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రిపై నోటికి వచ్చినట్లు మాట్లాడిన వైసిపి నేత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

# పక్కాగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ



– విసిలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వెల్లడి

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లాలో రెండవ విడత పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని పక్కాగా చేపట్టామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మికి చెప్పారు. రాష్ట్రంలో రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల రెండవ విడత పంపిణీ, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రధానకార్యదర్శి జి.సాయిప్రసాద్‌తోకలిసి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డిఆర్ఓలు, ఆర్డీఓలతో రాష్ట్ర భూపరిపాలనాశాఖముఖ్యకమిషనర్‌మంగళవారంరాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. రైతులకు ఎక్కడా ఏ సమస్య రాకుండా పాస్ పుస్తకాల పంపిణీని పూర్తిచేయాలన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రీసర్వేఅనంతరం సవరించిన భూమీ వివరాలు, క్యూ ఆర్ కోడ్, రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు.ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా మండల, గ్రామ స్థాయిలోని రెవిన్యూ సిబ్బందిని పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి ప్రత్యేకంగా విధులు కేటాయించామన్నారు. జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ,డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న,ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

## 'ప్రియమైన శత్రువు' షూటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు బడేటి,చింతమనేని





**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీరామ్ నగర్ 10వ రోడ్డు శ్రీ శ్రీ విద్యాసంస్థల అధినేత శ్రీ శ్రీ శర్మ ఆధ్వర్యంలో తెరకెక్కుతున్న 'ప్రియమైన శత్రువు' అను చిత్ర షూటింగ్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ,దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, మాజీ శాసనసభ్యులు అంబికా కృష్ణ,సినీ నిర్మాత కరాటం రాంబాబు, కె.వి.సత్యనారాయణ,నారా శేషు తదితరులు పాల్గొన్నారు.

## 14,15 తేదీలలో మంగళగిరిలో జరిగే నాస్తిక మేళా జయప్రదం చేయాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఈ నెల 14,15 తేదీ లలో మంగళగిరి సమీపంలోని చార్వాక ఆశ్రమంలో జరిగే 34 వ జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చెయ్యాలని జిల్లా హేతువాద సంఘం అధ్యక్షులు కడలి రామాంజనేయులు,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో జరిగిన హేతువాద సంఘంజిల్లా సమావేశంలో జాతీయ నాస్తిక మేళా కరపత్రాల ఆవిష్కరణ మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో భక్తి ఒకవ్యాపారంగా మారిపోయిందని అన్నారు.దీనిని ప్రభుత్వాలే పెంచి పోషిస్తున్నాయ న్నారు. మంగళగిరిలో జరుగుతున్న నాస్తిక మేళా రెండు రోజులకార్యక్రమంలనువివరించారు.ఈ కార్యక్రమం లో హేతువాద సంఘం నాయకులు ముత్యాల సాంబశివరావు, కోడూరి సత్యనారాయణ,వాకాడ రాజారావు,కెల్లా కన్నబాబు,సిపిఐ నాయకులుపుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

– ఆశా డేలో డి.డి.ఆర్.సి. నిపుణుల పిలుపు



**పెదవేగి,మేజర్ న్యూస్ :** దొండపాడు నందు గల ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారు పెదవేగి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి)లో నిర్వహించిన 'ఆశా డే' సమావేశంలో దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమశీలో పెదేవేగి ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.మాధవి పాల్గొన్నారు. డి.డి.ఆర్.సి కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డి.డి.ఆర్.సి కేంద్రంలో అందుబాటులో ఉన్న ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, మరియు వినికిడి లోపం ఉన్నవారికి అందించే స్పీచ్ థెరపీ గురించి, అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం అందించే వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు,కృత్రిమ అవయవాల పొందే ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పి హెచ్ సి వైద్యాధికారులు, డి.డి.ఆర్.సి సిబ్బంది ,మండలంలోని ఎ.ఎన్.యం.లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# 12న జరిగే సమ్మెలో పాల్గొననున్న పంచాయతీ కార్మికులు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈ నెల 12న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటారని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి కిషోర్ అన్నారు. మంగళవారం ఉదయం కార్మికుల దేశవ్యాప్త సమ్మె నోటీసును జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నందు జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ కె అనురాధ కు అందజేశారు. ఈ సందర్భంగా పి కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రిషన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు,అటెండర్స్, స్వీపర్లు, డ్రైవర్స్ కార్మికులకు జీతాలు బకాయి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12న మండల కేంద్రాలు, జిల్లా కేంద్రం ఏలూరులో జరిగే ప్రదర్శన సభలలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ. అప్పలరాజు, నాయకులు బి జగన్నాధ రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు చేయించుకోవాలి : ఏడిఏ వెంకటమణి







**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** రైతులందరు పంటనమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడిఎ జి వెంకటమణి తెలిపారు. ముదినేపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ మొబైల్ ఫోన్ నందు ఏపీఏఐఎంఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని వ్యవసాయ శాఖ సమాచారాన్ని ఉచితంగా పొందాలన్నారు. ఏఓ బి వేణుమాధవ్ మాట్లాడుతూ మినుము పైర్లపై ఏర్పడిన బూడిద తెగులును హెక్సా కొనజోల్ మందును లీటర్ నీటికి రెండు మిల్లీ లీటర్ల మందును కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు , గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### : ఎమ్మెల్యే పితాని



**పెనుమంట్ర,మేజర్న్యూస్:** నత్తారామేశ్వరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పట్టాదారు పాస్‌బుక్ పంపిణీ కార్యక్రమంలో ఆచంట నియోజవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ, అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతోందని పేర్కొన్నారు. గోస్తానదిలో కిక్కిరిసిన తొలగించి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను దశలవారీగా తొలగించి రైతులకు సాగునీరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. సోమరాజు ఇల్లేంద్రపురం వద్ద ఉన్న లాక్‌ను త్వరలో పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి రైతులకు అనుకూలంగా మారుస్తామని హామీ ఇచ్చారు.

వంతుల వారీగా వచ్చే నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నత్తా రామేశ్వరం పంపనపాలెం గ్రామాల మధ్య ఉన్న రహదారిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఆ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైతులు, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మట్టి నమూనాలు సేకరించాలి

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మట్టి నమూనాలను సేంద్రీయ వ్యవసాయం సాగు చేస్తున్న ప్రతి రైతు పొలంలో తప్పనిసరిగా సేకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాష అన్నారు. మండలం లోని పేరంపేటలోని సేవా కేంద్రం వద్ద రైతు సేవ కేంద్రం సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి పరీక్షించటం ద్వారా భూమిలో పోషకాల లభ్యత ఏ విధంగా ఉందో తెలుసుకోవచ్చు అన్నారు. దీంతో భూమికి పోషకాలు అందజేయడం ద్వారా మొక్కలకు అందుతుందని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో 820 మట్టి నమూనాలు సేకరించటానికి 22 సేవా కేంద్రాల్లో ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు పేజీ బుచ్చిబాబు,మండల వ్యవసాయ అధికారి టి.పవన్ కుమార్,రైతు సేవ ప్రకృతి,సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలుకలు నివసించు బొరియలు గుర్తిస్తున్న రైతులు




**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాల్లో (వరి పంట సాగు చేయు) వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకలు నివసించు బొరియలను రైతులతో గుర్తించారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగముగా మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అడబాల జోషిలా ఆధ్వర్యంలో వరి పొలాల చుట్టూ ఉన్న గట్లు పై ఎలుక బొరియలు గుర్తించి తడి మట్టి తో పూడ్చి వేశారు. బుధవారం వాటిని తెరిచి ఉన్న బొరియలను ఎలుక నివసించు బొరియలుగా గుర్తించి బ్రమోడైలిన్ విషపు ఎరను 10 గ్రా.చొప్పున కాగితం పొట్లాలుగా కట్టి ఆ బొరియలు వద్ద పెట్టి సామూహికంగా ఎలుకల నిర్మూలన రైతులందరూ ఒకేసారి నిర్వహిస్తారని ఆమె తెలిపారు. కావున గ్రామ వ్యవసాయ శాఖ, గ్రామ పంచాయతీ వారి భాగస్వామ్యం తో బ్రోమోడైయోలిన్ 0.25శాతం సీబీ మందును 2 పాళ్ళుం2 పాళ్ళు నూనె96 పాళ్ళు నూకలుకు కల్పించి 100 గ్రా.చొప్పున విషపు ఎరను తయారు చేసి మండలంలో 61 కేజీల మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామనిమండలం లో ప్రజాప్రతినిధులు, రైతులు ఉ కౌలు రైతులు పాల్గొని విజయ వంతం చేయ వలసిందిగా ఏవో కోరారు.

# న్యాయవాదుల సంక్షేమానికి కృషి



**జంగారెడ్డిగూడెం,మేజర్న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ను ఈనెల 13వ తేదీ జరగనున్న ఎన్నికల్లో మహిళఅభ్యర్థిగా పోటీ చేస్తున్నానని,జంగారెడ్డిగూడెం న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని హైకోర్టు న్యాయవాది ఆర్.గంగాభవాని తెలిపారు. జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీఎస్ఆర్ మూర్తి అధ్యక్షతన మంగళవారం న్యాయవాదుల సమావేశం జరిగింది. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు మేకా ఈశ్వరయ్య,అచ్యుత్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ విత్తనాల రాజు, న్యాయవాదులు ఉద్దండం ఏసుబాబు,వింజమూరు కిషోర్,ముళ్ళపూడి శ్రీనివాస్, జివి ఆర్ శేఖర్,సాయి కుమారి,సుగుణ కుమారి, భువనేశ్వరి, తదితరులు మాట్లాడారు.

## చేనేత కార్మికుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవాలి

**– రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సంఘం కన్వీనర్ అల్లాడ సూర్య భాస్కర్**



**పెనుమంట్ర, మేజర్ న్యూస్:** రాష్ట్రం లో ఉన్న చేనేత కార్మికుల దీర్ఘ కాలంగా పడుతున్న కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవాలని రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాజకీయ విభాగ కన్వీనర్ అల్లాడ సూర్య భాస్కర్ కోరారు. తరతరాలుగా మగ్గం మీద జీవితం నేసుకుంటూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోస్తున్న వర్గం చేనేతని ఆయన అన్నారు. ప్రస్తుతం అదే చేనేత కుటుంబాలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతు న్నాయని,నూలు ధరలు విపరీతంగా పెరిగి పత్తి, పట్టు, రేయాన్ వంటి ముడి సరుకులు సకాలంలో అందడం లేదని ఆయన వాపోయారు. ప్రభుత్వం ప్రకటించే సబ్సిడీలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని,తయారు చేసిన వస్త్రాలకు కనీస గిట్టుబాటు ధర కూడా రావడం లేదని, మార్కెట్ మొత్తం ప్రైవేట్ వ్యాపారులు, మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నెలల తరబడి శ్రమించి నేసిన చీరలకు సరైన విలువ దక్కక, నేతన్నలు అంతా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

### : జిల్లా న్యాయమూర్తి వాసంతి



**నరసాపురం,మేజర్ న్యూస్ :** ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు మార్చి నెల14వ తారీకున నర్సాపురం లోని అన్ని కోర్ట్ సముదాయాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 10వ అదనపు జిల్లా జడ్జి చైర్ పర్సన్ ఎ.వాసంతి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ఆయా కోర్టులలో ఉన్న రాజీపడతగిన అన్ని క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, సివిల్ కేసులు, భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు మొదలగునవి రాజీ చేసుకోవచ్చునన్నారు.

ప్రతి రోజు కోర్టు సముదాయంలో జరుగుచున్న మధ్యవర్తిత్వం ద్వారా కూడా కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటు ఉందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొనుటకు వారి వారి న్యాయ వాదుల ద్వారా గాని,సంభందిత పోలీసు వారిని లేదా కోర్టు ప్రాం గణంలో ఉన్న న్యాయ సేవాదికారా సంస్థను గానీ సంప్రదిం చాలని తెలిపారు. బ్యాంక్ , బి.ఎస్. ఎన్.ఎల్‌కు సంభందించిన లావాదేవీలు ప్రి లిటిగేషన్ కేసుల క్రింద సెటిల్ చేసుకోవచ్చునని,వర్చువల్‌గా కూడా కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటును ఉన్నత న్యాయస్థానాలు కల్పించినట్లు న్యాయమూర్తి తెలిపారు.

# అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి





**– రోడ్లు ,మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే బాలరాజు**

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** పోలవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ ధ్యేయమని,ఏజన్సీ ప్రాంతశీలో రహదారులకు మహర్దశ కలగనుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మండలశీలోని దొరమామిడి నుండి ఆలివేరు గ్రామం వరకు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చిర్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే రోడ్లు మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకమని ఆయన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏజన్సీ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఏజన్సీ ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు.అనంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అలాగే అంతర్వేదిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను చిర్రి బాలరాజు ప్రారంభించారు.అనంతరం గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వంటశాలలో భోజనాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో,గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, తీగల గోపాలకృష్ణ, జి.ఎస్. నాయుడు, మనోహర్, పూనెం రాజా, ఏలేటి ఏడుకొండలు, దాసరి మాణిక్యాలరావు, గురజాల వెంకటేశ్వరరావు, తుష్టి చిన వెంకటేశ్వరరావు, కైగాల సూరిబాబు, మడివి నాగ దుర్గారావు, జోడే కృష్ణమూర్తి ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే వ్యక్తిత్వ వికాసం అలవర్చుకోవాలి

**– ప్రముఖ విద్యావేత్త వంగవీటి పుష్పవల్లి**



**నరసాపురం, మేజర్ న్యూస్:** విద్యార్థి దశ నుండే వ్యక్తిత్వ వికాసం అవసరమని ప్రముఖ విద్యావేత్త వంగవీటి పుష్పవల్లి అన్నారు. స్థానిక పార్క్ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం రాయల్ వశిష్ట క్లబ్ ఆధ్వర్యంలో 'వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త వంగవీటి పుష్పవల్లి హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా,విద్యార్థి దశ నుండే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మరో వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ చదువును భారంలా భావించి కష్టపడి కాకుండా, సబ్జెక్టుపై అవగాహన పెంచుకుంటూ ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలరన్నారు. రాయల్ వశిష్ట క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిచిన విద్యార్థులకు రాయల్ వశిష్టక్లబ్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామని ప్రకటించడంతోపాటు పుష్పవల్లి రాధాకృష్ణల సహకారంతో అవసరమైతే ఉన్నత విద్య వరకు కూడా ప్రోత్సాహాన్ని అందించేందుకు సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా దామోదర్, రాయల్ వశిష్ట క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ,దేవిరెడ్డి ధర్మారావు, కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు, ఇంటి ప్రభాకర్,పులపర్తి కుమార్ రాజు, కొప్పినీడి కుమార్, తోట నాని, పోలిశెట్టి గణేశ్వరరావు, పావిరాల దేశియ్య,కోలా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలి



**భీమడోలు,మేజర్ న్యూస్ :** ఐసిడిఎస్ కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని కోరుతూ, అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్., సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడ ఎస్ ప్రాజెక్ట్ వద్ద మంగళవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సి.ఐటి.యు.జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ, ఐసిడిఎస్ ప్రాజెక్టులను ప్రారంభించి అర్ధ శతాబ్దం దాటుతున్న అధిక శాతం అంగన్వాడీ కేంద్రాలకు కనీస సౌకర్యాలు లేవని విమర్శించారు. ఐసిడి ఎస్ భీమడోలు ప్రాజెక్ట్ వర్కర్స్ ,హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలుస్వర్ణ కుమారి మాట్లాడుతూ, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణన చేయటం వలన ప్రభుత్వపరంగా మంజారయ్యే పలు పథకాలకు అర్హత ఉన్నప్పటికీ వారికి దక్కడం లేదన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎం.ఎస్. రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# రైతులందరూ ఈ పంట నమోదు చేసుకోవాలి



**– జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాష**

**చాట్రాయి, మేజర్ న్యూస్,** పంట సాగు చేస్తున్న రైతులందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాష సూచించారు. మండలంలోని ఎర్రవారిగూడెం గ్రామంలో షేక్ హబీబ్ భాషా ఈ పంట నమోదును ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న మొక్కజొన్న, వరి పంటల పొలాలను పరిశీలన చేశారు. నాణ్యమైన, అధిక దిగుబడులు కోసం వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు.

ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం చాట్రాయి మండలంలో 70 శాతం ఈ పంట నమోదు పూర్తయినదని మిగిలిన విస్తీర్ణాన్ని కూడా ఫిబ్రవరి 20 లోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే రైతులు కూడా సొంతగా ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ డౌన్లోడ్ చేసుకొని రైతు వివరాలతో లాగిన్ అయ్యి రైతు స్వతహాగా ఈ పంట నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రతీ రైతు ఎపిఎఫ్ఆర్ నందు నమోదు చేసుకుని విశిష్ట సంఖ్య గుర్తింపు పొందాలనని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. శివశంకర్ ,ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎల్బీ చర్లలో ఆశా వర్కర్ల నిరసన




**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్స్ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశావర్కర్స్ అందరూపాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు.మంగళవారం మండలంలోని ఎల్ బి చర్ల పీహెచ్సీ వద్ద ఆశ వర్కర్స్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే ఉంర్కోడ్స్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగసంస్థలు పరిరక్షించాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు.అనంతరం డాక్టర్ ఎం.మాధురికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పులపర్తి రత్న కుమారి,షేక్ నసీమా బేగం,మేకా విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల ధర్నా



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** తహసిల్దార్ కార్యాలయం వద్ద వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు, పాలకొల్లులో ధనలక్ష్మి హోటల్ యజమాని సచివాలయ సిబ్బంది అయిన షకీలా పై చేయి చేసుకున్నందుకు నిరసనగా ప్రభుత్వానికి తెలిసే విధంగా తాసిల్దార్ని కలిసి మెమోరాండం సమర్పించారు,దీనిపై తాసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్ మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత ముఖ్యమని, విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగుల పై దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఇటువంటి హేయమైన చర్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్,ఏపీ జి.ఈ ఏ వివిధ సంఘాలు పాల్గొన్నారు,

## 20 నుండి శ్రీ శ్రీ భూలక్ష్మి దేవి అమ్మవారి మహోత్సవాలు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని దర్భ గూడెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ భూ లక్ష్మీదేవి అమ్మవారి 51వ వార్షిక మహోత్సవాలు ఈనెల 20వ తేదీన ప్రారంభమై 24వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా గ్రామస్తులకు ఆడపడుచుగా శ్రీ శ్రీ భూలక్ష్మి దేవి అమ్మవారు విరజిల్లుతున్నారని కొనియాడారు. పరిసర ప్రాంతాల ప్రజలు గ్రామస్తులు అమ్మవారి మహోత్సవాలలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారి జాతర మహోత్సవంలో ఐదు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు వేదపండితుల వేదమంత్రాల నడుమ కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు భక్తులు అమ్మవారిని దర్శించి ధనధాన్యాలతో ఆయు ఆరోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని కోరుతూ మహోత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలి





**– ప్రభుత్వ వైద్యులకు జిల్లా కలెక్టర్ నాగరాణి హితవు**

**ఆకివీడు,మేజర్ న్యూస్ :** ఆకివీడు మండలం పెదకాపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆశా డే మీటింగ్ లో పలు సూచనలు చేశారు. తొలుత ఓపి, యాంటినెంటల్ చెకప్స్, తదితర రిజిస్టర్లను పరిశీలించి కేసులు వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లెప్రసీ,హెచ్ఐవి, టీబీ, డెలివరీ కేసులు ఎన్ని ఉన్నాయని పరిశీలించారు. ఈ నెలలో డెలివరీలు ఎన్ని ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. టిబి వ్యాధిగ్రస్తులకు ముందులను క్రమం తప్పకుండా అందిస్తున్నారా,వారిని చెక్ చేస్తున్నారా, బలమైన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బాల బాలికల్లో రక్తహీనత కేసులు ఏమైనా ఉన్నాయా, తరచూ ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి పరీక్షలు చేస్తున్నారా అని అడిగారు. ఒక్క గర్భిణీ కేసు కూడా మిస్ అవ్వకుండా చూడాలని, టార్గెట్ కపుల్స్‌ను కలుసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కొంతమంది మీకు తెలియకుండానే చెరువుల దగ్గర పనిచేస్తూ అకస్మాత్తుగా ప్రసవం కావడం జరుగుతుందని, అటువంటి కేసులు కూడా మిస్ అవ్వకుండా అన్ని ప్రాంతాల్లో సమాచారాన్ని తెలుసుకొని వారికి వైద్యం అందేలా చూడాలన్నారు.ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే వ్యక్తిగతంగా, సామాజికంగా దేశం ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందితో సమావేశంలో ఉండగానే ఒక వృద్ధుడు కాలు ఇన్ఫెక్షన్ వైద్యం నిమిత్తం అక్కడికి రావడంతో అతని ఓపి కార్డు పరిశీలించి,ఎన్ని రోజుల నుంచి వస్తున్నారు, బిళ్ళలు, ఇంజక్షన్ ఇచ్చారా, హాస్పటల్లో బాగా చూస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతని కాలుకు వచ్చిన ఇన్ఫెక్షన్ ను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంలో పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ రమేష్, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, గ్రామ సర్పంచ్ బేబీ స్నేతు, ఎంపీపీ కటారి జయలక్ష్మి, తహసిల్దార్ ఫరూక్, ఇంచార్జ్ ఎంపీడీవో బిఈ మార్కండేశ్వర రావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు ఉన్నారు.

# సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

**– 14 నుండి పట్టిసంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష**



**పోలవరం,మేజర్ న్యూస్ :** పోలవరం మండలం పట్టిసం క్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం పట్టిసీమలో అధికారులతో జేసీ సమీక్షించారు.ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ పట్టిసం ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 14వ తేదీ నుండి మూడు రోజులుపాటు జరిగే ఈ ఉత్సవంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిచ్చే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్ టిసి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.పట్టిసీమ పెర్రీ నుండి భక్తులు నది దాటేందుకు భక్తుల సంఖ్యకు తగిన విధంగా బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సేవలు అందించేందుకు ఎమర్జెన్సీ బోట్లను సిద్ధం చేయాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతోపాటు,అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని, 108,104 సిబ్బందిని మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు రోజులుపాటు పట్టిసం క్షేత్రం పరిధిలో మద్యం షాపులను మూసివేసి ఉంచడంతోపాటు ఎక్కడా బయట మద్యం విక్రయాలకు తావులేకుండా గట్టి నిఘా ఉంచాలని ఎక్సైజ్ అధికారులను జేసి ఆదేశించారు.ఇసుకతెన్నులపై చలువ పందిళ్లు, స్నాన ఘట్టాల వద్ద మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు నిర్మించిన తాటాకు గదులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఐటిడిఏ పీఓ రాములు నాయక్,ఆర్డీఓ రమణ, ఆర్టీసీ ఆర్ ఎం షబ్నమ్, దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్,సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మోహన్ బాబుకు వ్యతిరేకంగా ఉల్లంపర్రు ఐటిఐ కళాశాల వద్ద నిరసన




**పాలకొల్లు, మేజర్ న్యూస్:** ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జరిగిన తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు కిడ్నాప్‌కి వ్యతిరేకంగా ఉల్లంపర్రు ఐటిఐ కళాశాల వద్ద మోహన్ బాబుకి వ్యతిరేకంగా ఉల్లంపర్రు ఐటిఐ కళాశాల వద్ద నిరసన చేపట్టారు, ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అతని చిత్రపటాన్ని దగ్ధం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కార్యదర్శి సభ్యులు పాల్గొన్నారు,

# మద్య మత్తులో తోపులాట – ఒకరు మృతి






తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్; తాడేపల్లిగూడెం పట్టణంలో పాత ప్రభాత టాకీస్ ప్రాంతంలో మద్యం మత్తులో జరిగిన హత్య ఈరోజు ఉదయం వెలుగు చూసింది. రాత్రి విజయ్ శివ అను ఇద్దరూ పాత ప్రభాత టాకీస్ పైకి వెళ్లి మద్యం సేవించి మాట మాట పెరగడంతో,పాత గొడవల నేపథ్యంలో ప్రభాత టాకీస్ పై నుండి విజయ్ చూసి వేయడంతో శివ తీవ్ర గాయాలు పాలై మృత్యువాతకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.మృతుడు 17వ వార్డు కొత్తగూడెం చెందిన నీలి శివ (50)గా గుర్తించారు.

మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించిన తాడేపల్లిగూడెం రూరల్ సీఐ రవికుమార్ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సంఘటన స్థలానికి తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ వెళ్లి పరిశీలించారు.

## 13 నుండి శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి 30వ కళ్యాణ మహోత్సవాలు

**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దివ్య క్షేత్ర ప్రాంగణంలో మంగళవారం 30వ కళ్యాణ మహోత్సవ కరపత్రాన్ని గ్రామ సర్పంచ్ మోదుగ సునంద,తహసిల్దార్ సాయిబాబు,సబ్ ఇన్స్పెక్టర్ జయబాబు,విద్యుత్ అధికారి డి శ్రీనివాస్,హెల్త్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ కోవ్వడమ్మా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయకమిటీ చైర్మన్ అనుమోలు వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శివరాత్రి కళ్యాణ మహోత్సవాలు ఈనెల 13వ తేదీ శుక్రవారం నుండి 17వ తేదీ మంగళవారం వరకు దాతలు సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, 15వ తేదీశివరాత్రి పర్వదిన సందర్భంగా సామూహికంగా మహన్యాస రుద్రాభిషేకం ,ఆదివారం రాత్రి 7 గంటల నుండి స్వామి వారి కళ్యాణం,16వ తేదీ సోమవారం స్వామివారి రథోత్సవం,17వ తేదీ మంగళవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు హాజరవుతారని వచ్చిన భక్తులందరికీ ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కరపత్రాల ఆవిష్కరణ అనంతరం వచ్చిన అధికారులకు దుశాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పాకలపాటి రమాదేవి, కడిమి వరలక్ష్మి, కొరివి శ్రీకాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు పర్వతనేని మురళి, పసుమర్తి రాము,అడపా నాగరాజు,పేరం రాంబాబు, కమ్మిల రమేష్ రాజు, లింగారెడ్డి శ్రీనివాస్,ఆత్కూరి శివ సత్యనారాయణ, నల్లూరి శ్రీనివాస్,మండం ఆదిత్య, చిలుకూరి కృష్ణ ప్రసాద్,అద్దంకి జగ్గారావు,భూమి వీరరాఘవులు, తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఈ -పంట వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి : జేసి



**పాలకోడేరు, మేజర్ న్యూస్,** రైతులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా ఈ -పంట వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలో యాప్ ద్వారా డ్రోన్ ఫోటో తీసి ఈ పంట చేయు విధానమును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ పంట నమోదు కార్యక్రమాన్ని సక్రమ ంగా పారదర్శకంగా జరిగేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. డ్రోన్ ద్వారా చేయటం వలన ఎక్కువగా ఈ పంట నమోదు చేయడంతో పాటు సమయం ఆదా అవుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లోకి వెళ్లి అక్కడ సాగులో ఉన్న పంటను పరిశీలించి రైతులతో స్వయంగా మాట్లాడారు. ఈ పంటను యాప్‌లో నందు నమోదు ప్రక్రియను జాయింట్ కలెక్టర్ స్వయంగా రైతుతో ఫోటో తీసి పరిశీలించారు. పంట వివరాలు నమోదు, ప్రతి రైతులు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.పంట నమోదు సరిగ్గా జరిగితేనే రైతులకు ప్రభుత్వ పథకాలు లబ్ధి అందుతుందని,పంట నష్ట పరిహారం బీమా మద్దతు ధర వంటి ప్రయోజనాలు సకాలంలో అందుతాయని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.అందువల్ల క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయ రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రతి రైతు వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య, గ్రామ కార్యదర్శి,ఆర్ఐ, విఆర్ఓ, రైతులు ఉన్నారు.

## కారు వదిలి - బస్సు ఎక్కిన ఎమ్మెల్యే బాలరాజు



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** కారు వదిలి బస్సు ఎక్కారు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. సాధారణ ప్రయాణికుడిలా బస్సు ఎక్కడంతో ప్రయాణికులు షాక్ అయ్యారు. ఒక ఎమ్మెల్యే ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా సాధారణ ప్రయాణికుడిలా బస్సు ఎక్కడశీ ఆశ్చర్యంగా ఉందంటూ ప్రయాణికులు అన్నారు.

బస్సులో ప్రయాణించి ప్రయాణికులను ఆత్మీయంగా పలకరించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రయాణికులకు భరోసా ఇచ్చారు.